సాక్షి
కాకినాడ

శనివారం । 14 । జనవరి । 2023

SAKSHI PREMIER LEAGUE

ధనాధన్ టోర్నీకి వేళాయె..


సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల (జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. - IIలో▸



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఎం.కళ్యాణ చక్రవర్తి (హైదరాబాద్ కొంపెల్ల) శుక్రవారం రూ.1,00,008 విరాళం సమర్పించారు.


డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.70 అడుగులకు చేరింది.

వీరు సై..వారు నై నై..





- సంక్రాంతి కోడిపందేలకు సిద్ధమవుతున్న నిర్వాహకులు
- ఉమ్మడి 'తూర్పు'న సిద్ధమవుతున్న 100 బరులు
- 20కి పైగా కీలకమైనవి
- రూ.200 కోట్లు పైగా లావాదేవీలు జరుగుతాయని అంచనా
- 'కత్తి' కడితే కట్టడి తప్పదంటున్న పోలీసులు
- గుండాటలు, జూదాలకూ 'నో'

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంప్రదాయం పేరుతో కోడి పందేలకు కత్తులు కట్టి మరీ నిర్వాహకులు సిద్ధమవుతూంటే.. అటు పోలీసులు నిబంధనల కొరడా ఝళిపిస్తూ కో'ఢీ'కి ససేమిరా అంటున్నారు. దీంతో సంక్రాంతి పండగ వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం కనిపిస్తోంది. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించడం తరతరాల ఆనవాయితీగా వస్తోంది. కోళ్లకు కత్తులు కట్టకుండా సంప్రదాయ పందేలు నిరభ్యంతరంగా నిర్వహించుకోవచ్చు. మొదటి నుంచీ ఈ మాట పోలీసులే చెబుతున్నారు. కత్తులు కట్టి కోడిపందేలు నిర్వహిస్తే కటకటాల్లో వేస్తామని నాలుగైదు రోజులుగా హెచ్చరిస్తున్నారు. అయితే సంక్రాంతి మూడు రోజులూ నిర్వహించే పందేల కోసం ఆగస్టు నెల నుంచి లక్షలకు లక్షలు పోసి పందెం కోళ్లను బలవర్ధక ఆహారంతో పెంచి పోషిస్తూ వచ్చాం. ఇప్పుడు కత్తులు కట్టొద్దు, పందేలు వద్దంటే ఎలాగని నిర్వాహకులు అంటున్నారు. కత్తులు కట్టకుండా, రూ.కోట్లు పలకకుండా ఆడే కోడిపందేల్లో మజా ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా 'తమదైన శైలిలో' పందేలు నిర్వహించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పనిలో పనిగా పందేలతో పాటు గుట్టుచప్పుడు కాకుండా గుండాటలు, జూదాలు ఆడేందుకు కూడా తెరవెనక ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- **అసలు కోడిపందేలు ఉంటాయా ఉండవా అనే సందిగ్ధంలో చాలాచోట్ల గురువారం వరకూ బరులు సిద్ధం చేయలేదు.** పలువురు నిర్వాహకులు పొరుగున పశ్చిమ గోదావరి జిల్లాకు మకాం మార్చేశారు కూడా.
- కోనసీమలో గత పండగకు బరి ఏర్పాటు చేసిన నిర్వాహకుడు స్థానిక వ్యతిరేకతతో పందేల బరిని ఈసారి తాళ్లరేవు మండలం నీలపల్లికి మార్చేశాడు. రెండు రోజులుగా బరుల కోసం టెంట్లు వేయడం, వాటిని పోలీసులు తొలగించడం జరుగుతోంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా కోడిపందేలు జరుగుతుంటాయి. ఇక్కడ ఈ ఏడాది కూడా అదే ఒరవడి కొనసాగుతోంది. పందేల్లో కోనసీమ తరువాతి స్థానం కాకినాడ జిల్లాకే దక్కుతుంది. ఈ ఏడాది నవ్య తూర్పు గోదావరి జిల్లాలో కూడా బరులు సిద్ధమవడంతో పందెం కోడి సై అంటోంది.
- ఉమ్మడి జిల్లాలో కత్తి కట్టి రూ.కోట్లు మార్చే బరులు 70 వరకూ ఉంటాయి. అత్యధికంగా రూ.కోటి, రూ.2 కోట్ల పందేలు జరిగే బరులు 20 వరకూ ఉన్నాయి. వీటిలో కూడా కోనసీమదే అగ్రస్థానం. చిన్నాచితకా అన్నీ లెక్కేస్తే మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 100 వరకూ బరులు ఉంటాయని గత లెక్కలే చెబుతున్నాయి.
- కోడిపందేలు ఒక ఎత్తయితే.. వీటి ముసుగులో ఏర్పాటు చేసే గుండాట బోర్డులకు కూడా రూ.లక్షల్లోనే ఒప్పందాలు జరుగుతూంటాయి.

కోనసీమ జిల్లాలో..

- రాజోలు మండలం చింతలపల్లి, కాట్రేనిపాడు, కూనవరం, లక్కవరం, గోగన్నమఠం, వీవీ మెరక, సఖినేటిపల్లి, రామేశ్వరం, సఖినేటిపల్లి లంకల్లో బరులు రూ.లక్షలు పలుకుతున్నాయి. ఒక్కో బరిలో రూ.అర కోటి పైనే పందేలు జరిగే పరిస్థితి కనిపిస్తోంది.
- ఆత్రేయపురం మండలం లొల్ల, పేరవరం, వసంతవాడ, ర్యాలితో పాటు రావులపాలెం మండలంలోని మూడు బరుల్లో తలపడేందుకు పందెం కోళ్లు సై అంటున్నాయి.
- కొత్తపేట మండలంలో మూడు బరుల్లో ఏర్పాట్లు ఉన్నాయి.
- అల్లవరం, కోడూరుపాడు, గోడి, గుత్తులవారిపాలెం, రెల్లుగడ్డ, గుండెపూడి గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, అన్నంపల్లి, కొత్తలంక, చెయ్యేరు. గెద్దనాపల్లి, మొక్కలతిప్ప, కొమరగిరి, బాణపురాల్లో కోడిపందేలకు సన్నాహాలు జరుగుతున్నాయి.
- తాళ్లరేవు మండలం నీలపల్లి, గాడిమొగ, జార్జిపేట, సుంకరపాలేల్లో పందేలకు ఏర్పాట్లు చేశారు.
- మండపేటలో మూడు బరులతో పాటు ఏడిద, ద్వారపూడి, వెంటూరు, కపిలేశ్వరపురం లంక గ్రామాల్లో సైతం పందేలకు కోళ్ల కాలు దువ్వుతున్నాయి.

కాకినాడ జిల్లాలో...

- కాకినాడ రూరల్ వలసపాకలలో ప్రతిష్టాత్మక బరి ఏర్పాటైంది. ఇక్కడకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పందెంకోళ్లను సత్తా చాటేందుకు తీసుకువస్తున్నారని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇక్కడ పందెం రూ.కోట్లలోనే పలుకుతుందని అంటున్నారు. ఇందుకు పోటీగా తిమ్మాపురంలో కూడా బరులు సిద్ధమయ్యాయి.
- కరప మండలంలో తొమ్మిదిచోట్ల బరులు ఏర్పాటు చేస్తున్నారు. పెనుగుదురు, గురజనాపల్లి, కొంగోడు, విజయరాయుడుపాలెం, యండమూరు, వాకాడ, వేములవాడల్లో పందెంకోళ్లు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి.
- తుని నియోజకవర్గంలో ఆరు బరులు సిద్ధమయ్యాయి.
- పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఎనిమిది బరులు ఏర్పాటు చేస్తున్నారు.
- జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడి మండలాల్లో నరేంద్రపట్నం, కాట్రావులపల్లి, జె.కొత్తూరు, రాజపూడి, మల్లిసాల, వెంగయ్యపురం, గోవిందపురం తదితర గ్రామాల్లో కూడా బరులు సిద్ధమయ్యాయి.
- కిర్లంపూడి, వేలంక, తామరాడ, గోనేడ గ్రామాల వద్ద రెండు బరుల్లో కోళ్లు తలపడనున్నాయి.
- పెద్దాపురం నియోజకవర్గంలో ఆర్‌బీ కొత్తూరు, చంద్రమాంపల్లి, దివిలి, కట్టమూరు, గుడివాడ, పులిమేరుల్లో ఆరు.. సామర్లకోట మండలం వేట్లపాలెం, మేడపాడు, జి.కొత్తూరు, ఉండూరు, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో ఆరు చొప్పున బరులు సిద్ధమయ్యాయి.

తూర్పు గోదావరి జిల్లాలో..

- అనపర్తి, కుతుకులూరు, బిక్కవోలు, కొమరిపాలెం, బలభద్రపురం, రంగంపేట, వడిశలేరు, దొంతమూరు, సింగంపల్లి, పెదరాయవరం, దొడ్డిగుంట గ్రామాల్లో కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. రామేశ్వరం, జి.మామిడాడ, శహపురం, కాండ్రేగుల, పెదపూడి, గండ్రేడు గ్రామాల్లో పందెంకోళ్లు తలపడనున్నాయి.
- రాజానగరం నియోజకవర్గంలోని 12 గ్రామాల్లో పందెం కోళ్లు తలపడే పరిస్థితి ఉంది. పుణ్యక్షేత్రం, ముక్కినాడ, నరేంద్రపురం, దివాన్‌చెరువు, నిడిగట్ల, గాడాల, శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, గాదరాడ, రఘుదేవపురం, పెదకొండేపూడి, నల్గొండ, మిర్తిపాడు గ్రామాల్లో బరులు ఏర్పాటయ్యాయి.
- కొవ్వూరులోని తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో కోడిపందేల బరులు సిద్ధమయ్యాయి. మండలంలో కోడిపందేలు ఆపాలంటూ పలువురు హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు.

సంప్రదాయానిదే పైచేయి

పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టి, ఎంత కట్టడి చేసినా ఏటా ఉమ్మడి జిల్లాలో పండగ మూడు రోజులూ కోడిపందేలను నిలువరించలేని పరిస్థితి. పోలీసు ఆంక్షలపై ఇక్కడి ప్రజల సంస్కృతీ సంప్రదాయాలదే ఎప్పుడూ పైచేయి అవుతోంది. అందుకే ఏటా బరులు, వాటిలో కోడిపందేలు, అక్కడ ఏర్పాటు చేసే తినుబండారాల స్టాళ్లలో జరిగే లావాదేవీలు రూ.200 కోట్లు పైనే ఉంటున్నాయని అంచనా.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై చర్యలు తప్పవు



సంక్రాంతి సందర్భంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. కోడిపందేలు, గుండాటలపై ఉక్కుపాదం మోపుతాం. కాకినాడ జిల్లాలోని 36 ప్రదేశాల్లో సంక్రాంతి సంప్రదాయ క్రీడోత్సవాలు నిర్వహించాం. జిల్లా వ్యాప్తంగా 296 బైండోవర్ కేసులు నమోదు చేసి, 850 మందిని బైండోవర్ చేశాం. వారి నుంచి 1,346 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశాం. జూదాలు కోడిపందేలపై 51 కేసులు నమోదు చేసి, 263 మందిని అరెస్ట్ చేసి రూ.9,96,122 స్వాధీనం చేసుకున్నాం. కోడిపందేలు, జూదాలు నిర్వహించినా, బరులు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ, కాకినాడ జిల్లా



తాళ్లరేవు మండలం నీలపల్లిలో కోడిపందేలకు సిద్ధమైన బరి



తాళ్లరేవు మండలం నీలపల్లి బరిలో విస్తృత ఏర్పాట్లు



అల్లవరం మండలం కోడూరుపాడులో కొబ్బరి తోటలో బరికి ఏర్పాట్లు

న్యూస్‌రీల్

16న స్పందన రద్దు

కాకినాడ సిటీ: కనుమ పండగ పురస్కరించుకుని ఈ నెల 16న ప్రభుత్వ సెలవు దినం కావడంతో స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, అధికారులు గమనించాలని కోరారు.

అన్నదానానికి రూ.5.11 లక్షల విరాళం



విరాళం చెక్కు అందజేస్తున్న కర్రి వెంకట్రాజు కుటుంబ సభ్యులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపురసుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలోని అన్నదానానికి తిమ్మాపురానికి చెందిన పారిశ్రామికవేత్త కర్రి వెంకట్రాజు రూ.5,11,116 విరాళం అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావుకు వెంకట్రాజు కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. వారికి ఆలయ పండితులు ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ పండితులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవుల చుట్టూ ప్రదక్షణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. శుక్రవారం స్వామివారిని 30 వేల మంది దర్శించుకున్నారు. రెండు వేలు వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మందికి నిత్యాన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించారు.

మహిళా హాకీ చాంపియన్‌షిప్ విజేత కాకినాడ



రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన కాకినాడ జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్: ఏలూరులో ఈ నెల 11 నుంచి 13 వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా అంతర్ జిల్లాల హాకీ చాంపియన్ షిప్‌ను కాకినాడ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో విశాఖ జట్టుపై 1–0 స్కోర్‌తో గెలుపొంది కప్‌ను సాధించింది. జట్టుకు కోచ్‌లుగా పీడీ వి.రవిరాజు, పి.శేషుకుమారి, మేనేజర్‌గా జి.దుర్గాదేవి వ్యవహరించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన జట్టును హాకీ సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు, సభ్యులు అభినందించారు.

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ చక్రవర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

సంక్రాంతి వేడుకలకు రత్నగిరి ముస్తాబు





సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగిమంటకు ఏర్పాట్లు.చిత్రంలో ఈత, తాటి, కొబ్బరి చెట్లు, సత్యదేవుని వార్షిక కల్యాణమండపం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం ఆరు గంటలకు రామాలయం ఎదురుగా గల ప్రాంగణంలో కుమ్మరిలోవ తపోవనం స్వామీజీ సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి భోగి మంటను వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటాని చెప్పారు. రామాలయం ఎదురుగా గల ప్రాంగణంలో భోగిమంట, జానపద కళారూపాల ప్రదర్శనలకు తెలుగు సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా తాటిఆకులతో వేసిన గుడిసె, కొబ్బరి చెట్టు, ఈత చెట్టు, తాటి చెట్టు, వరి ఆకుమడి, ఫిష్ ట్యాంక్, ధాన్యపు రాశి, నుయ్యి, రచ్చబండ, కోడిపుంజులు, ఎడ్లబండి, పొట్టేలు, ఆవు దూడ ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు జానపద కళారూపాలను ప్రదర్శించే గంగిరెద్దుల వాళ్లు, బుడబుక్కల సాయిబు, జంగమ దేవర, కొమ్మదాసరి తదితరులు కూడా సందడి చేయనున్నారని వివరించారు. ఈ సందర్భంగా సత్యదేవుని ఆలయం, రాజగోపురాలకు చేస్తున్న విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు అలరించనున్నాయి. భక్తుల దర్శనాలకు సైతం అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన జాతీయ స్థాయి టీటీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, విజయ్‌ప్రకాష్ తదితరులు


పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ (టీటీ)పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఏపీ టీటీ అకాడమీ అధ్యక్షుడు వి.భాస్కరరామ్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టేబుల్ టెన్నిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావు చిన్నారావు, కె.మోహన్‌బాబు, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు సూర్యారావ్, వేణుగోపాల్, ఆయా 24 సెక్టార్ల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వీరే...

అండర్–14 బాలుర విభాగంలో శరతాక్ ఆర్య ప్రథమ, నిఖిల్ మీనన్ ద్వితీయ, అభీక్ కాస్యప్ తృతీయ, అండర్–15 బాలికల విభాగంలో ఆయూషి సింఘాల్, హిమాన్షి చౌదరి, దానిజైన్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అండర్–17 బాలుర విభాగంలో శాంకదీప్‌దాస్, ప్రియాంజి భట్టాచార్య, ఎస్.మణికందన్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్–17 బాలికల విభాగంలో ఆవిష ఖర్మాకర్, శానిదుర్గన్, కావ్యే గుప్తలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అండర్–19 బాలుర విభాగంలో సామిల్ ముఖర్జీ, ఆదర్శ ఓంచత్రి, బోడిశత్వ చౌదరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. అండర్–19బాలికల విభాగంలో ఓశికి జోర్దార్, దిశ, మేరియా సిల్కీ జోషిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

వినియోగదారుల చేతికి బ్రహ్మాస్త్రం

- ఇక పౌరసరఫరా, తూనికలు, కొలతలు శాఖల్లో మోసాలకు చెక్
- టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానిస్తూ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్
- 1967 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం



కాకినాడ సిటీ: గుండు సూది నుంచి గూగుల్ సేవల వరకూ.. పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకూ.. రియల్‌ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ–కామర్స్ సంస్థల దోపిడీ వరకూ ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా, వస్తువుల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందిస్తోంది. ఫిర్యాదులు, వినతులు, సలహాలు కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 1967 నంబర్‌ను రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధానకార్యాలయంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18004250082/1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు, ఒకే దేశం, ఒకే రేషన్‌కార్డు ఫిర్యాదులకు 18004253157/14445 టోల్ ఫ్రీ నంబర్, రాష్ట్ర ఆహారభద్రతా ఫిర్యాదులు, సలహాలు, సూచనలకు 18004252388/155235 టోల్ ఫ్రీ నంబర్, తూనికలు, కొలతల శాఖకు సంబంధించిన ఫిర్యాదులు కోసం 18004254205 టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరోశాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నంబర్లను గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 అనే నంబర్‌తో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలశాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో తూకాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. అలాగే సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు. చేసిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తరువాత ఫిర్యాదు ఏదశలో ఉన్నదో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రజా పంపిణీ వ్యవస్థకు టోల్ ఫ్రీ నంబర్



ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యల పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్ 1967ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

- ఎస్.ఇలక్కియ, జాయింట్ కలెక్టర్

నూరుశాతం లక్ష్య సాధన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌ల ద్వారా అన్ని ఆరోగ్య కార్యక్రమాలు, సేవలు నూరుశాతం లక్ష్యం సాధించే దిశగా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ పీహెచ్‌సీలో ఎన్‌సీడీ సీడీ సర్వే, ఐడీ పూర్తి ఈ నెల 28 లోపు పూర్తి చేయాలన్నారు. తగినంత సిబ్బంది లేకపోతే మరొక ప్రాంతం నుంచి తీసుకువచ్చి జిల్లా అంతటా నూరుశాతం లక్ష్యం పూర్తి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎన్‌సీడీ సీడీ సర్వేలో ఉన్న ఐదు పారా మీటర్లు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో ఏఎన్ఎం, వైద్యాధికారి కలిసి పని చేయాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా ప్రతి ఒక్కరూ ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎం.శాంతిప్రభ, జిల్లా ప్రోగ్రాం అధికార్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విరివనాల్లో సంక్రాంతి శోభ



పుల్లా చినసత్యనారాయణ తన నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

కడియం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని విరివనాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. వినూత్నంగా చేసిన మొక్కల కూర్పుతో పండగ శుభాకాంక్షలు తెలిపాయి.

- కడియపులంక వద్ద జాతీయ రహదారిపై ఉన్న పుల్లా చిన సత్యనారాయణకు చెందిన సత్యదేవ నర్సరీలో మొక్కల కూర్పుతో భారతదేశ పటం, అందులో నాగలితో ఉన్న రైతును తీర్చిదిద్దారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని చాటి చెప్పేలా ఈవిధంగా ఏర్పాటు చేసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసినట్లు నర్సరీ రైతు చినసత్యనారాయణ తెలిపారు.
- కడియం – వీరవరం రోడ్డులోని పల్లా సత్యనారాయణకు చెందిన పల్ల వెంకన్న నర్సరీలో వివిధ రకాల మొక్కలతో గాలిపటం ఆకృతి రూపొందించారు. ఆరు రకాల మొక్కలతో చేసిన ఈ కూర్పు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



పల్ల సత్యనారాయణ తన నర్సరీలో..

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి.

https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22వతేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్‌గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబరు : 9912220345

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

జిల్లా మీదుగా 'వందేభారత్' పరుగులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

రాజమహేంద్రవరం సిటీ: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20833/20834) ఆదివారం జిల్లా మీదుగా పరుగులు తీయనుంది. ఇప్పటికే రైల్వే అధికారులు సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య ఈ రైలుకు ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖపట్నం – సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు తక్కువ సమయంలో గమ్యాన్ని చేరనుంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.58 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. 9 గంటలకు విశాఖపట్నం బయలుదేరుతుంది. 16వ తేదీ ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరే ఈ రైలు 7.55 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. ఈ రైలు ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులూ నడుస్తుంది. ఈ నూతన రైలుకు రాజమహేంద్రవరంలో స్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్వారపూడిలో రేపు మకరజ్యోతి దర్శనం

మండపేట: ఆంధ్రా శబరిమలగా ఖ్యాతికెక్కిన ద్వారపూడి అయ్యప్ప స్వామి సన్నిధిలో ఈ నెల 15వ తేదీన మకరజ్యోతి దర్శనానికి ఆలయ వ్యవస్థాపకుడు కనకరాజు గురుస్వామి ఆధ్వర్యాన విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజామున గణపతి హోమంతో ప్రత్యేక పూజలు ఆరంభిస్తారు. స్వామివారి ఇరుముడి అభిషేకాలు, స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి ఆభరణాల పెట్టెను రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారవేత్త ములకల సత్యకుమార్‌స్వామి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పుల నడుమ సాయంత్రం 6.40 గంటల సమయంలో భక్తులకు మకరజ్యోతి దర్శనభాగ్యం కలగనుంది. ఉదయం నుంచి రాత్రి వరకూ జరిగే ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కనకరాజు గురుస్వామి కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మార్పులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. జనరల్ విభాగంలో థియరీ పరీక్షలు ముందుగా ప్రకటించినట్టుగానే యథాతథంగా జరుగుతాయి. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం శుక్రవారం ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో థియరీ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయన్నారు. జనరల్ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 26 నుంచి మార్చి 7 వరకూ, వృత్తి విద్యా విభాగంలో ప్రాక్టికల్స్ వచ్చే నెల 20 నుంచి మార్చి 7 వరకూ నిర్వహిస్తామని వివరించారు. ఆదివారాల్లోనూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.